# సాక్షి ఆదిలాబాద్

శనివారం । 23 । మార్చి । 2024






**వారెవ్వా.. హలీం**

రంజాన్ మాసం నేపథ్యంలో ప్రత్యేక వంటకాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఘుమఘుమలతో ఆకట్టుకుంటున్నాయి.

8లో▸



**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| శని: 6:29 | ఆది: 4:54 |

గరిష్ఠం/కనిష్ఠం 37.0 /24.0

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

## న్యూస్‌రీల్

### నాణ్యమైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

**ఆదిలాబాద్‌టౌన్:** రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో ఇటీవల నియామకమైన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (పల్లె దవాఖానా)లో పనిచేసేందుకు ఇటీవల 22 మంది విధుల్లో చేరినట్లు తెలిపారు. వీరు వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలకు అనుసంధానంగా పనిచేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీపీఎం అనిల్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

### ఓటరు నమోదుకు మరో అవకాశం

**కైలాస్‌నగర్:** జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువత ఓటరు నమోదుకు ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. అలాగే ఓటరు జాబితాలో తమ పేర్లను ఓటర్లు పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. లేని పక్షంలో బీఎల్‌వోల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటు హక్కు పొందాలని సూచించారు.

### లైసెన్స్‌డ్ ఆయుధాలు అప్పగించండి

**కైలాస్‌నగర్:** ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లాలోని లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగిన వారంతా తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఈనెల 26లోపు వాటిని అప్పగించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో లేదా అధీకృత ఆయుధ డీలర్ల వద్ద వాటిని డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. ఒకవేళ అప్పగించకుండా ఆయుధాలతో తిరిగినట్‌లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిపాజిట్ చేసిన ఆయుధాలను జూన్ 10తర్వాత తిరిగి తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు కోరుకునే వారు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ను సెల్‌నంబర్ 9492422444లో సంప్రదించాలని తెలిపారు. అలాగే కలెక్టరేట్‌లోని జిల్లా ఆయుధ స్క్రీనింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి



5కే రన్‌లో పాల్గొన్న అధికారులు


**ఆదిలాబాద్:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి సాయన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 5కే రన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి తదితరులున్నారు.

### 'ఉపాధి' పెండింగ్ వేతనాలు విడుదల

**కైలాస్‌నగర్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. వారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. వీరికి గతేడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల వేతనాలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యారు. ఈ క్రమంలో ఉద్యోగులు సీఎం రేవంత్ రెడ్డితో పాటు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు పలుమార్లు వారు కలిసి తమ సమస్యను విన్నవించారు. స్పందించిన ప్రభుత్వం పెండింగ్ వేతనాలు విడుదల చేసింది.సర్కారు నిర్ణయంపై 'ఉపాధి' ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మళ్లీ తెరపైకి సోయం

- కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం
- 'హస్తం' హైకమాండ్ పాజిటివ్‌గా ఉందనే టాక్
- ఆదిలాబాద్ స్థానం పెండింగ్‌తో మొదలైన చర్చ
- పోటీలో ఉండటం ఖాయమంటున్న సిట్టింగ్ ఎంపీ



సోయం బాపూరావు, ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ

**సాక్షి, ఆదిలాబాద్:** బీజేపీ సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు మళ్లీ తెరపైకి వచ్చారు. ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం జోరందుకుంది. హస్తం పార్టీ హైకమాండ్ కూడా పాజిటివ్‌గా ఉందనే టాక్ మొదలైంది. గురువారం రాత్రి రాష్ట్రంలో ఐదు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం ఆదిలాబాద్ స్థానం పెండింగ్ పెట్టడం వెనక ఇదే కారణమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీ టికెట్ గొడం నగేశ్‌కు కేటాయించిన తర్వాత సోయం కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగింది. అయితే చేరికలు, అభ్యర్థి ఎంపిక పరిశీలన వేగవంతం చేయడంతో ఇక కాంగ్రెస్ ప్రక్రియ కొలిక్కి వచ్చిందని అందరూ భావించారు. అయితే తాజా రాజకీయాలు ఆసక్తిగా మారాయి. ఈ విషయమై సోయం బాపూరావును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించినప్పుడు.. 'పార్టీ ఏదైనా.. తాను పోటీలో ఉండటం ఖాయం..' అని పేర్కొనడం గమనార్హం.

**సీనియర్ నేతలను ఢీకొట్టగలరా..**

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అభ్యర్థి ఎంపిక విషయంలో కొద్ది రోజులుగా పరిణామాలు వేగంగా మారుతూ వచ్చాయి. చివరకు ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్ తమ పోస్టులకు స్వచ్ఛంద విరమణ ప్రకటించి సీఎం సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరిన తెలిసిన విదితమే. ఈ ఇద్దరి నుంచే ఎవరినైనా అభ్యర్థిగా ఎంపిక చేస్తారని ప్రచారం సాగింది. సుగుణ అనుచరులు సంబరాలు సైతం చేసుకున్నారు. అయితే ఒక్కరోజుకే పరిస్థితి మారిపోయింది. తాజా గా సోయం బాపూరావు కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం వారి అభ్యర్థిత్వం విషయంలో బ్రేక్ పడినట్టేననే చర్చ సాగుతుంది. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు గొడం నగేశ్, ఆత్రం సక్కు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నారని, ఈ సీనియర్ నేతలను కొత్త నేతలు ఢీకొట్టగలుగుతారా.. అనే సమీకరణాల్లోనూ పార్టీ ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీంతో గోండు సామాజిక వర్గానికే చెందిన సిట్టింగ్ సోయంనే పార్టీలోకి చేర్చుకొని బరిలోకి దించాలని హైకమాండ్ పాజిటివ్‌గా ఉన్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా మనస్సు మార్చుకున్నారని చెబుతున్నారు. ఇదిలా ఉంటే సోయం బాపూరావుకు బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయానికి శనివారం రావాలని పిలుపు అందింది. గొడం నగేశ్‌కు సహకరించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్ చుగ్ కోరేందుకే పిలిచారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోయం పార్టీ కార్యాలయానికి వెళ్తారా.. లేదా అనేది ఆసక్తికరం. పోటీలో ఉండటం ఖాయమని చెబుతున్న నేపథ్యంలో బీజేపీ పెద్దలను ఆయన కలవకపోవచ్చనే ప్రచారం సాగుతుంది.

**మరోవైపు లంబాడాకు ఇస్తారనే చర్చ..**

రాష్ట్రంలో తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ ఆదిలాబాద్ విషయంలో చివరి క్షణంలో పెండింగ్ పెట్టిందన్న ప్రచారం విస్తృతంగా సాగుతుంది. కాగా ఈ పెండింగ్ విషయంలో లంబాడా సామాజికవర్గ కాంగ్రెస్ నేతలు మరో రకంగా చెబుతున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఆదివాసీ సామాజిక వర్గానికి టికెట్ కేటాయించిన దృష్ట్యా లంబాడా సామాజిక వర్గానికి కాంగ్రెస్ కేటాయించే యోచనలో ఉండడంతోనే పెండింగ్ పెట్టిందని చెబుతుండటం గమనార్హం. మహబూబాబాద్ టికెట్ లంబాడాకు కేటాయించడంతో ఆదిలాబాద్ స్థానం సమీకరణాల్లో భాగంగా ఆదివాసీకే కేటాయిస్తారనే ప్రచారం ఉన్నప్పటికీ రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ఉన్న బంజారా జనాభా దృష్ట్యా పార్టీ ప్రయోజనాల కోసం లంబాడాకు ఇవ్వాలని యోచిస్తుందని చెప్పుకొస్తున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న నేతలను కూడా పార్టీ పరిశీలిస్తుందని చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్, ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్‌లలో ఎవరికైనా టికెట్ దక్కవచ్చనే ప్రచారం కూడా లేకపోలేదు. ఏదేమైనా కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు అయ్యేవరకు ఈ చర్చలు సాగే పరిస్థితి కనిపిస్తుంది. ఇదిలా ఉంటే హోలీ పండగ తర్వాత నిర్ణయం వెలువడవచ్చని పార్టీ నేతలు చెబుతున్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లను అందిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా

**తాంసి:** లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున ఆయా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా సూచించారు. భీంపూర్ మండలంలోని బెల్సరీ రాంపూర్, తాంసిలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ర్యాంప్‌లు, టాయిలెట్స్ తదితర నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం రాంపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులు శృతిక, కీర్తిక కలెక్టర్ ఎదుట గొండి భాషలో సాంస్కృతిక గీతాన్ని ఆలపించారు. వారికి కలెక్టర్ స్వయంగా తన వాహనంలో నుంచి తీసుకొచ్చిన బిస్కెట్ ప్యాకెట్లను అందించి అభినందించారు. గ్రామానికి చెందిన హస్తకళాకారుడు ఇంద్రజిత్ ఇంటికి వెళ్లి ఆయన తయారు చేసిన ఇత్తడి కళాకృతులను పరిశీలించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. కలెక్టర్‌కు ఇంద్రజిత్ దంపతులు స్వయంగా తయారు చేసిన ఇత్తడి కళాకృతిని కానుకగా అందించి మురిసిపోయారు. అనంతరం కలెక్టర్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆయన వెంట భీంపూర్ ఎంపీపీ కుడ్మేత రత్నప్రభ సంతోష్, తహసీల్దార్లు సత్యనారాయణ, లక్ష్మీ, ఎంపీడీవోలు మోహన్‌రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, వైద్యాధికారి శ్రావ్య, ఆయుష్ వైద్యాధికారి నర్మద, మిషన్ భగీరథ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు సాయికుమార్, హరిత తదితరులు ఉన్నారు.

# శతశాతం దిశగా..

- పన్ను వసూళ్లలో లక్ష్యానికి చేరువగా జీపీలు
- ఇప్పటికే 200 పంచాయతీలు వందశాతం క్రాస్
- అదే బాటలో మిగతా పంచాయతీలు



కంఠ గ్రామంలో పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి సాజన్య

**కైలాస్‌నగర్:** గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్నుల వసూళ్లు శతశాతం దిశగా సాగుతున్నాయి. మరో పది రోజుల్లో 2023–24 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో కార్యదర్శులు ఉదయం నుంచే సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ పన్ను వసూలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 200 జీపీలు వంద శాతం పన్ను వసూలు చేసి ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇందులో ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాలు ఉండటం గమనార్హం. మిగతా జీపీల్లోనూ 76 నుంచి 90 శాతం పన్నులు సేకరించి లక్ష్యానికి చేరువగా ఉన్నారు. మరో తొమ్మిది రోజులు మిగిలి ఉండటంతో లక్ష్యాన్ని చేరుకునే దిశగా ముందుకు సాగుతున్నారు.

**రూ.5.05 కోట్ల పన్నుల వసూలు**

జిల్లాలో మొత్తం 468 జీపీలుండగా వాటి పరిధిలో 1,76,360 ఆస్తులున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5కోట్ల 86లక్షల 48వేల 231 పన్నుల వసూలు లక్ష్యంగా పంచాయతీ అధికారులు నిర్ణయించారు. వీటిని పూర్తిస్థాయిలో వసూలు చేయాలనే ఉద్దేశంతో రెండునెలల ముందే ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నారు. అందులో ఇప్పటివరకు రూ.5కోట్ల 5లక్షల 45వేల 965 వసూలు చేశారు. ఇంకా రూ.కోటి 12లక్షల 34వేల 390 వసూలు చేయాల్సి ఉంది. బకాయిల విషయానికి వస్తే రూ.31లక్షల 36వేల 346 పెండింగ్‌లో ఉండగా ఇప్పటి వరకు రూ.18లక్షల 18వేల 287 వ సూలు చేశారు. ఇంకా రూ.13లక్షల14వేల 530 వ సూలు చేయాల్సి ఉంది. ఈ ఏడాది, బకాయిలన్నీ కలిపి రూ.6కోట్ల17లక్షల 84వేల 577 పన్నుల వ సూలు లక్ష్యంగా ఉండగా ఇప్పటివరకు రూ.5కోట్ల05లక్షల 45వేల 965 వసూలు చేశారు. ఇంకా రూ.1కోటి 12లక్షల 34వేల 790 వసూలు చేయాల్సి ఉంది.

**ఆదర్శం.. ఆ 13 పంచాయతీలు**

జిల్లాలోని 13 పంచాయతీలు వందశాతానికి మించి ఆస్తి పన్ను వసూలు చేసి ఆదర్శంగా నిలుస్తున్నాయి. అత్యధికంగా జైనథ్ మండలంలోని కంఠ గ్రామం 143శాతంతో తొలిస్థానంలో నిలిచింది. ఈ పంచాయతీ పన్నుల లక్ష్యం రూ.1,09,950 కాగా గడువుకు ముందే రూ.1,57,739 వసూలు చేసి రికార్డు సృష్టించింది. ఇక నేరడిగొండ మండలం కిష్టాపూర్ 133శాతం, ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం, ఇచ్చోడ గ్రామ పంచాయతీలు 109శాతం, నేరడిగొండ మండలం దర్బాతండా 104శాతం, జైనథ్ మండలంలోని గూడ 103శాతం, బజార్‌హత్నూర్ మండలం గొకొండ, నార్నూర్ మండలం బలన్‌పూర్, జైనథ్ మండలంలోని కాన్పమేడిగూడ 102శాతం, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తిప్ప, రాజురా, తలమడుగు మండలం కప్పర్‌దేవి గ్రామ పంచాయతీలు 101శాతం వసూలు పూర్తి చేసి మిగతా జీపీలకు ఆదర్శంగా నిలిచాయి.

**జిల్లాలో వంద శాతం పన్నుల లక్ష్యం చేరిన జీపీల వివరాలు ..**

| మండలం | మొత్తం జీపీలు | వందశాతం లక్ష్యం చేరినవి |
|---|---|---|
| ఆదిలాబాద్ రూరల్ | 34 | 13 |
| బజార్‌హత్నూర్ | 30 | 16 |
| బేల | 37 | 22 |
| భీంపూర్ | 26 | 16 |
| బోథ్ | 33 | 11 |
| గాదిగూడ | 25 | 21 |
| ఇచ్చోడ | 32 | 29 |
| ఇంద్రవెల్లి | 28 | 13 |
| జైనథ్ | 40 | 26 |
| మావల | 03 | -- |
| సిరికొండ | 19 | 05 |
| తలమడుగు | 28 | 09 |
| తాంసి | 13 | 09 |
| ఉట్నూర్ | 37 | 10 |

### వందశాతం లక్ష్యం సాధిస్తాం



పంచాయతీల్లో పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునే దిశగా సాగుతున్నాం. మూడు నెలల ముందు నుంచే ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. డివిజనల్ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం. తదనుగుణంగా వారు కూడా క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేస్తున్నారు. 200 గ్రామాల్లో ఇప్పటికే వంద శాతం సాధించాం. మిగిలిన తొమ్మిది రోజుల్లో మిగతా పంచాయతీల్లోనూ లక్ష్యం పూర్తిచేస్తాం.

– ఎస్.శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

# నిఘా కట్టుదిట్టం

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక చెక్‌పోస్టులు
- మద్యం, డబ్బు అక్రమంగా తరలించకుండా చర్యలు
- బెల్టు షాపులపై మొదలైన దాడులు

**జిల్లాలో..**

| |
|---|
| ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు: 06 |
| అంతర్ జిల్లా చెక్‌పోస్టులు: 02 |
| సీజ్ చేసిన మద్యం: 402 లీటర్లు |
| సీజ్ చేసిన మద్యం విలువ: రూ.2,85,400 |
| నమోదైన కేసులు: 40 |



పిప్పర్‌వాడ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ ఆలం(ఫైల్)

**ఆదిలాబాద్‌టౌన్:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే కోడ్ వచ్చేసింది. ఈ నెల 16 నుంచి జూన్ 4వరకు అమలులో ఉండనుంది. మరోవైపు ఎన్నికల నిర్వహణలో యంత్రాంగం నిమగ్నమైంది. కోడ్ ఉల్లంఘించిన వారిపై కొరఢా ఝులిపించేందుకు పోలీసు అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు నిఘా పెంచాయి. అక్రమంగా డబ్బు, మద్యం తరలించకుండా చర్యలు చేపట్టారు. జిల్లాకు సరిహద్దుగా మహారాష్ట్ర ఉండడంతో ఎనిమిది చెక్‌పోస్టులు ఏ ర్పాటు చేశారు. ఇప్పటివరకు ఆయా చెక్‌పోస్టుల్లో డబ్బు సీజ్ కాలేదు. ఇక జిల్లాలోని ఆయా ప్రాంతా ల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై పోలీసులు వరుస దాడులు నిర్వహిస్తున్నారు. అక్రమంగా నిల్వ ఉన్న మద్యం సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

**బెల్టుషాపులపై దాడులు..**

జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై పోలీసులు దాడులు చేస్తూ మద్యం సీజ్ చేస్తున్నారు. కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కోడ్ నేపథ్యంలో బెల్టు షాపులను అధికారులు సీజ్ చేశారు. ఆ తర్వాత కోడ్ ఎత్తివేసిన వెంటనే మళ్లీ ఆ దందా కొనసాగుతోంది. ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణంలోని ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలోని బెల్టు షాపులపై దాడులు కొనసాగుతున్నాయి.

**అంతటా అలర్ట్..**

ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగం అలర్ట్ అయ్యారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ, ఆయా శాఖల అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని భరోసా కల్పిస్తున్నారు.

**ఆరు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు..**

ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాకు చుట్టుపక్కల మహారాష్ట్రకు ఆనుకొని ఉన్న ఆయా మండలాల సరిహద్దుల్లో ఆరు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. బేల మండలంలోని శంకర్‌గూడ, జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్, భీంపూర్ మండలంలోని కరంజి, తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్, బోథ్ మండలంలోని ఘన్‌పూర్‌లో వీటిని ఏర్పాటు చేశారు. వీటితో పాటు నేరడిగొండ, ఉట్నూర్‌లో రెండు అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు, ఎక్సైజ్, అటవీ శాఖ, రవాణా శాఖాధికారులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుంది. లేకుంటే సీజ్ చేస్తామని అధికారులు చెబుతున్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పాటు తనిఖీలతో పాటు సీసీ నిఘా ఏర్పాటు చేశారు.



ఆదిలాబాద్‌లో బలగాల మార్చ్‌ఫాస్ట్ (ఫైల్)

### ప్రత్యేక నిఘా..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక నిఘాలో భాగంగా జిల్లాలో ఆరు అంతర్రాష్ట్ర, రెండు అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం, డబ్బు తరలించకుండా చర్యలు చేపడుతున్నాం. చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు వాహనాల తనిఖీ సమయంలో వీడియో రికార్డింగ్ చేపడుతున్నాం. కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

– గౌస్ ఆలం, ఎస్పీ

# ఓటర్లు ప్రలోభాలకు గురికావొద్దు

- ఎస్పీ గౌస్ ఆలం

**నేరడిగొండ:** ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దని, ప్రజాసేవ చేసే నాయకుడిని ఓటు ద్వారా ఎన్నుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

# కుష్ఠు గుర్తింపు సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర పరిశీలకులు ప్రదీప్‌కుమార్

**ఆదిలాబాద్‌టౌన్:** కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. వ్యాధి గుర్తింపు ఉద్యమంలో భాగంగా ఈనెల 11 నుంచి ఇంటింటా సర్వే కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్, వడ్డెర కాలనీ, తాంసి మండలంలోని పొన్నారి, హస్నాపూర్, తలమడుగు మండలంలోని ఖోడద్, సుంకిడి గ్రామాల్లో ఆశ కార్యకర్తలు నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ప్రతీ ఒక్కరిని పరీక్షించాలని ఆదేశించారు. అనుమానితుల వివరాలు నమోదు చేసుకుని సమీపంలోని పీహెచ్‌సీకి పంపించాలని సూచించారు. అనంతరం తలమడుగు పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2027 వరకు కుష్ఠురహిత దేశం కోసం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠు నివారణ అధికారి గజానన్, వైద్యాధికారులు శ్రావ్యవాణి, హరీష్, డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్‌రావు, మధుసూదన్ రావు, హెచ్‌ఈఓ చిన్నన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సర్వే తీరును పరిశీలిస్తున్న డాక్టర్ ప్రదీప్ కుమార్

## క్లుప్తంగా

### నూతన డైరెక్టర్‌గా జిల్లా వాసి



నియామకపత్రం స్వీకరిస్తున్న రాజమణి

నిర్మల్‌ఖిల్లా/కుంటాల: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా నిర్మల్ జిల్లాకు చెందిన డాక్టర్ తుమ్మల రాజమణిని నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రస్తుత సంచాలకులు డాక్టర్ కే.సదాశివ నుంచి ఈ బాధ్యతలు స్వీకరించారు. రాజమణి నిర్మల్ జిల్లా కుంటాల మండలం ఓలా గ్రామనివాసి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మెడిసినల్ కెమిస్ట్రీలో ఎంఎస్సీ చదివి అదే విశ్వవిద్యాలయం నుంచి 2013లో మెడిసినల్ కెమిస్ట్రీలో డాక్టరేట్ పట్టా పొందారు. ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూరు. విశ్వవిద్యాలయ ఎస్సీ ఎస్టీ సెల్ సంచాలకులుగా మరియు కాంపిటీటివ్స్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని ఆచార్య మల్లారెడ్డి ఉత్తర్వుల లో పేర్కొన్నారు.

### పీహెచ్‌సీ ఎదుట గర్భిణి నిరసన



గర్భిణి జైల గంగామణి

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని జైల గంగామణి అనే గర్భిణి ఆస్పత్రి ఎదుట బైఠాయించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పీచర గ్రామంలో నివాసం ఉంటున్న తాను పరీక్షల నిమిత్తం నేరడిగొండ పీహెచ్‌సీకి తరచూ వస్తున్నట్లు తెలిపింది. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని వాపోయింది. దీంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు, సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కోరారు.

### గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి



పట్టుకున్న గుడుంబాతో పోలీసులు

సారంగపూర్: మండలంలోని దేవితండాలో గుడుంబా స్థావరాలపై ఎస్సై చంద్రమోహన్ శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ మహిళ వద్ద 16లీటర్ల నాటుసారా, 50లీటర్ల బెల్లం పాకం లభ్యం కావడంతో సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నాటుసారా తయారు చేసినా.. విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై వసంత్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



# వారెవ్వా.. హలీం



హలీం

హోటల్స్‌లో..

హలీం సెంటర్‌లో పార్సిల్ తీసుకెళ్తున్న స్థానికులు

- రంజాన్ మాసంలో విరివిగా లభ్యం
- ఈ ప్రత్యేక రుచికి... అందరు గులాం..
- ఏటా పెరుగుతున్న డిమాండ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విక్రయకేంద్రాలు
- రుచికర వంటకాలతో మార్కెట్‌లో గిరాకీ

ఉట్నూర్‌రూరల్: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైందంటే చాలు పట్టణ కేంద్రాలతో గ్రామ గ్రామాల్లో సైతం మార్కెట్‌లో సందడి వాతావరణం ఏర్పడుతోంది. అయితే రంజాన్ మాసంలో ప్రత్యేక వంటకం హలీమే. ఏటా రంజాన్ మాసం వచ్చిందంటే చాలు హలీం ప్రత్యేకంగా తయారు చేస్తారు. దీంతో హలీం సెంటర్లు బిజీగా మారుతాయి.. ఇది ముస్లింలకే కాదు, ప్రతీ ఒక్కరికి ఫేవరెట్ డిష్. దీని రుచి చూడాలని కొందరు.. కొత్తగా ట్రై చేసే వారు మరికొందరు.. ఏళ్ల తరబడి సీజన్‌లో దీని రుచిని ఆస్వాదించే వారు ఇంకొందరు.. ఇలా హలీంకు రంజాన్ సీజన్‌లో అందరూ గులాం అయిపోవాల్సిందే.. చికెన్(హరీస్), మటన్(హలీం)లతో చేసే ఈ వంటకాన్ని ఆరగించాలని చాలా మంది ఉవ్విళ్లూరుతుంటారు.

**హలీం.. అరబ్ దేశాల సంప్రదాయం..**

ఘుమఘుమలాడే రుచికలిగిన హలీం అరబ్ దేశాల సంప్రదాయ వంటకంగా ప్రఖ్యాతి. ఇరాన్, ఇరాక్, అఫ్ఘనిస్తాన్ తదితర ముస్లిం దేశాల నుంచి దిగుమతి చేసుకున్నప్పటికీ హైదరాబాద్ హలీంకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉంది. పరిశుభ్రమైన మాంసం, స్వచ్ఛమైన నెయ్యి, గోదుమలు, పిస్తా, కాజు, బాదం, కిస్‌మిస్, మిరియాలు, లవంగాలు, యాలకులు తదితర గరం మసాల దినుసులు వేసి సుమారు 12గంటల పాటు ఉడికించి తయారు చేయడం దీని ప్రత్యేకత. కేవలం రంజాన్ మాసంలో మాత్రమే లభ్యమయ్యే ప్రత్యేక వంటకం ఇది.

**రంజాన్ రుచులు**

రంజాన్ మాసంలో రోజా (ఉపవాసం) ఉన్న ముస్లింలు ఇఫ్తార్ వేళలో తీసుకునే ఆహారం ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది. ముఖ్యంగా హలీం, ఖుర్బానీకా మీఠా, కద్దుకాఖీర్ తదితర వంటకాలను తినడానికి ముస్లింలతో పాటు అన్ని వర్గాల వారు లొట్టలేస్తారు. అందుకే ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, ఆదిలాబాద్, భైంసా, నిర్మల్, ముథోల్, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మందమర్రి, ఆసిఫాబాద్, ఉట్నూర్ లాంటి ఏరియాల్లో ప్రత్యేక వంటకాలను తయారు చేసే దుకాణాలను నెలకొల్పి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి వినియోగదారులను ఆకర్శిస్తున్నారు.

**బాగా గిరాకీ పెరిగింది..**



రంజాన్ సీజన్‌లో హరీస్‌తో పాటు, హలీం, ఇతర వంటకాలకు బాగా గిరాకీ ఉంటుంది. ఈ రంజాన్ మాసం పూర్తయ్యే వరకు చాలా మంది వస్తుంటారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఇక్కడికి చాలా మంది వస్తుంటారు.

– అఫ్జాన్, బావర్చీ హోటల్ యజమాని, ఉట్నూర్

**ప్రత్యేక వంటకాలకు డిమాండ్**



రంజాన్ మాసంలో ప్రత్యేక వంటకాలకు డిమాండ్ ఎక్కువ. అందుకు ఇతర ప్రాంతాల నుంచి వంటకాలపై అవగాహన కలిగిన మాస్టర్లు ఈ ప్రాంతానికి వచ్చి తమ ప్రత్యేక వంటకాలను ప్రవేశపెడుతారు. వారికి నచ్చిన విధంగా వంటకాలు చేయడంతో ఎంతో ఇష్టపడతారు.

– సల్మాన్, మాస్టర్, యూపీ

**ప్రతి ఒక్కరూ మెచ్చే హరీస్**



రంజాన్ మాసం ప్రారంభం అయిందంటే హలీం, హరీస్‌లకు ప్రత్యేకంగా తింటాం. రంజాన్ నెలలో ఈ వంటకాలు దొరకడంతో పాటు తిరిగి పెళ్లి వంటకాల్లో మాత్రమే లభిస్తాయి. దీనిని తినడానికి ముస్లింలే కాకుండా ఇతరులు కూడా ఇష్టపడతారు.

– జావిద్, ఉట్నూర్

## పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న భాస్కర్

ఎదులాపురం: ఆదిలాబాద్ మున్సిపల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక కుటుంబాలకు మేలు చేకూర్చేలా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్, ఈపీఎఫ్, డబ్బులను తప్పకుండా సాధించుకుందామన్నారు. అవసరమైతే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్మికులకు ఎల్లవేళలా సీఐటీయూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు జనగం రాజమల్లు, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అగ్గిమల్ల స్వామి, జిల్లా అధ్యక్షులు దర్శనాల నగేశ్, డ్రైవర్ విభాగం అధ్యక్షుడు మెరుగు జనార్ధన్, ఉపాధ్యక్షుడు ఎండీ అజీమ్, లేబర్ల విభాగం అధ్యక్షుడు బొజ్జ ఉషన్న ఉన్నారు.

## ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం: విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లిన జెడ్పీఎస్ఎస్ భరంపూర్ పాఠశాల ఫిజికల్ సైన్స్ (ఎస్‌ఏ) ఉపాధ్యాయుడు ఎం.మహేందర్‌పై శాఖపరంగా చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నవీన్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టర్, విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ నుంచి అనుమతులు లేకుండా ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు విదేశాలకు వెళ్లినట్లు తమకు తెలిసినట్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కూడా ఇలాగే వెళ్లారని, ఓ ప్రైవేటు కంపెనీ నుంచి ట్రిప్పులకు వెళ్లినట్లు తెలియజేశారు. అనుమతి లేకుండా వెళ్లడం, అతడు చేస్తున్న వ్యాపారాలపై అధ్యయనం చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

## మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో పోలీసులు

ముథోల్: మండలంలోని బోరిగాం, గన్నోరా గ్రామాల్లో గురువారం రాత్రి అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బోరిగాం గ్రామంలో రూ.29వేల మద్యం, గన్నోరాలో రూ.26వేల విలువ గల మద్యాన్ని పట్టుకున్నట్లు వారు తెలిపారు.

భైంసాటౌన్: పట్టణంలోని బైల్‌బజార్ ప్రాంతంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యంను శుక్రవారం పట్టుకున్నట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. బైనివార్ శివ అనే వ్యక్తి బెల్ట్ దుకాణంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి రూ.6వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై షరీఫ్, సిబ్బంది ఉన్నారు.

## నగదు స్వాధీనం





వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్‌కుమార్

లక్ష్మణచాంద: ఎన్నికల నియమావళి నేపథ్యంలో రూ.50వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.లక్షా10వేల స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఎన్నికల కోడ్ నేపథ్యంలో లక్ష్మణచాంద నుంచి చామన్‌పెల్లి వెళ్లే మార్గంలో సోన్ సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్ వాహనాల తనిఖీలు చేపట్టారు. సుదర్శన్ అనే వ్యక్తి బైక్ పైన వెళ్తుండగా అతడిని తనిఖీ చేయగా సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1,10,000 స్వాధీనం చేసుకున్నారు. వాటిని కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ కమిటీలో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఇందులో పీసీలు సంజీవ్, హైమద్ ఉన్నారు.

**రూ.2లక్షలు పట్టివేత**

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వంశీ అనే వ్యక్తి వద్ద రూ.2లక్షలు పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని వివేక్ చౌక్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బైక్‌పై వచ్చిన వంశీ వద్ద నగదు సదరు లభించింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సరైన ధ్రువపత్రాలు లేకుండా నగదును తరలించడం నిషేధమని సీఐ అనిల్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో డాక్టర్ మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్ (32)రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం విధులకు హాజరై తిరిగి కారులో ఇంటికి వెళ్తే క్రమంలో రాత్రి నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం బట్టాపూర్ వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. రాజ్‌కుమార్ స్వగ్రామం నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం సావెల్ గ్రామం కాగా అందరితో కలివిడిగా ఉండే డాక్టర్ అకాల మరణంపై కడెం పీహెచ్‌సీ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

### కారును ఢీకొన్న లారీ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్ జాతీయ రహదారి ఎక్స్ రోడ్డు సమీపంలో శుక్రవారం కారును లారీ ఢీ కొన్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జందాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంగారెడ్డి జందాపూర్ గ్రామం నుంచి ఆదిలాబాద్ వైపు కారులో వస్తున్నాడు. ఇదే క్రమంలో ఎదురుగా వస్తున్న కేటీసీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన లారీ ఢీ కొట్టింది. దీంతో కారు ధ్వంసమైంది. కారు యజమాని ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాలిక మృతి



శాన్విక (ఫైల్)

పెంబి: పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది.. వివరాల్లోకి వెళ్తితే... మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన భుక్య అమర్ సింగ్ కూతురు శాన్విక (4) ఈ నెల 2వ తేదీన పిచ్చి కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. కుటుంబీకులు నిర్మల్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇటీవల వాతావరణంలో మార్పులు రావడంతో చిన్నారి ఆరోగ్యం క్షీణించి శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

### యువతి అదృశ్యం

వాంకిడి: మండలంలోని ఎల్లానగర్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లానగర్ గ్రామానికి చెందిన ముచ్చనేని సునీత (18) గురువారం మండల కేంద్రంలో నిర్వహించే సంతకు వెళ్లి వచ్చింది. శుక్రవారం తెల్లవారు జామున సునీత ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, గురువారం మహారాష్ట్రలోని సుగునాపురం గ్రామానికి చెందిన మోటి అంకూష్ అనే యువకుడు ఎల్లానగర్‌లోని సునీత ఇంటి ముందు రెండు, మూడు సార్లు చక్కర్లు కొట్టగా ఆమె అక్క సారక్క అతడిని నిలదీసింది. దీంతో ఆ యువకుడు వెళ్లి తిరిగి రాలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్

భైంసాటౌన్: బీజేపీ విలువలతో కూడిన పార్టీ అని, నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలు ఉన్న పార్టీలో చేరడం గర్వంగా ఉందని మాజీ ఎంపీ, ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్.కాటన్‌లో ఎమ్మెల్యే రామారావుపటేల్ ఆధ్వర్యంలో శుక్రవారం పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత దేశం ప్రపంచ దేశాల సరసన నిలిచిందన్నారు. ఆర్థికంగా ఐదోస్థానంలో నిలిపిన ఘనత మోదీకి దక్కుతుందని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికలు దేశానికి అత్యంత కీలకమని, అత్యధిక స్థానాలు గెలుచుకుని మోదీని మూడోసారి ప్రధానిని చేసుకోవాల్సిన అవసరముందన్నారు. తనపై నమ్మకంతో పార్టీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిందని, నాయకులు, కార్యకర్తలు సహకరించి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు భైంసా మున్సిపల్ చైర్మన్ ఎన్నిక విషయమై తనపై కొందరు అపోహలు ప్రచారం చేస్తున్నారని, అప్పట్లో పార్టీ నిర్ణయం మేరకే పనిచేశానన్నారు. ఏ పార్టీలో ఉన్నా నిబద్ధత, నిజాయితీతో పనిచేశానని గుర్తు చేశారు.

**కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి..**

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే రామారావుపటేల్ కోరారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉందని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, కానీ తాను అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే నియోజకవర్గానికి రూ.140 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో సైతం బీజేపీని గెలిపించుకుని కేంద్రం నిధులతో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. సమావేశంలో నాయకులు బి.గంగాధర్, సోలంకి భీంరావు, సావ్లి రమేశ్, పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



హాజరైన అధికారులు, పీవీటీజీలు

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులు పాఠశాలల్లో చదువుకునేందుకు ముందుకు వచ్చేలా వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం స్థానిక కొమురంభీం ప్రాంగణంలో బాల సాహిత్యాన్ని తెలుగు నుంచి గోండి, కొలాం భాషలోకి అనువాదం చేసే మూడు రోజుల క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోండి, కొలాం అనువాదంతో గిరిజన విద్యార్థులు సంతోషంగా పాఠశాలలకు వచ్చి విద్యను నేర్చుకుంటారన్నారు. వారికి అర్థమయ్యే రీతిలో ఈ అనువాదం ఉంటుందన్నారు.

**మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలి..**

గిరి వికాసం కేంద్రాలలో ఎంపిక చేసిన పీవీటీజీ (కొలాం, తోటి) సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వందనద్ వికాస్ కేంద్రం ద్వారా గుర్తించిన అభ్యర్థులకు పూర్తి స్థాయి మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలని, అటవీ ఉత్పత్తులు తదితర వనరుల ద్వారా స్వయం ఉపాధిలో రాణించేలా వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి స్వయంగా ఆర్థిక జీవనోపాధి కలిగేలా వారికి అవగాహన కల్పిస్తూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, రూమ్ టూ రీడ్ ప్రతినిధులు ప్రవీణ్, సాయి హర్ష, అజిత్, గోండి కోఆర్డినేటర్ దేవురావు, కొలాం కోఆర్డినేటర్ యశ్వంత్‌రావు, మోతీరాం ఉన్నారు.

## దిగుబడినిచ్చే నువ్వు విత్తనాలను సాగు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్

ఖానాపూర్: రైతులకు అధిక దిగుబడిని ఇచ్చే జేసీఎస్1020, వైఎల్ఎం 66 రకం నువ్వు విత్తనాలను సాగుచేయడం ద్వారా రైతులు అధిక దిగుబడి పొందవచ్చని భారతీయ నూనె గింజల పరిశోధనస్థానం ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని బావాపూర్(ఆర్) తండాలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నువ్వు పంట క్షేత్ర దినోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. షెడ్యూల్ తెగ ఉప పథకం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలతో పాటు నూనె గింజల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటలో సస్యరక్షణ చర్యలకు డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని డాక్టర్ సతీష్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో ఏవో ఆసం రవి, మేనేజర్ రత్నాకర్‌రావు, డాక్టర్ మంగేష్, డాక్టర్ దురై మురుగన్, వినేష్, అఖిల్ పరమేశ్వర్, విజయ్, బిక్కు, రాజేశ్వర్, లింగన్న, రోహన్ ఉన్నారు.

## ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం ఐదేళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్ట్ సమన్వయల అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం.. నిర్మల్‌రూరల్ మండలం నిలాయిపేట్ గ్రామానికి చెందిన నల్ల లక్ష్మణ్ గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంట సాగుచేశాడు. పంటను అడవి పందుల నుంచి కాపాడుకోవడం కోసం వైర్ ఏర్పాటు చేసి కరెంటు కనెక్షన్ ఇచ్చాడు. అదే గ్రామానికి చెందిన గంగోని బుచ్చన్న (52)కు లక్ష్మణ్ పొలం పక్కన ఉన్న భూమిలో మొక్కజొన్న పంట సాగుచేశాడు. పంటను అడవి జంతువుల నుంచి కాపాడుకోవడం కోసం 16 సెప్టెంబర్ 2017న రోజులాగే రాత్రి కాపలగా వెళ్లగా.. లక్ష్మణ్ చేను చుట్టూ కరెంటు కనెక్షన్ ఇచ్చిన విషయం తెలియక అతడి పొలం నుంచి వెళ్లే సమయంలో కరెంట్ షాక్ తలిగి మృతిచెందాడు. దీంతో బుచ్చన్న కుమారుడు మనోహర్ నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సునీల్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం, అప్పటి సీఐ ప్రస్తుత డీఎస్పీ జీవన్‌రెడ్డికి అప్పగించారు. ఈ మేరకు లక్ష్మణ్‌ను అరెస్టు చేసి చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కలకుంట్ల వినోద్‌రావు 10మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ పైవిధంగా శుక్రవారం తీర్పునిచ్చారు.

## ఆకట్టుకుంటున్న కూడళ్లు





ఆదిలాబాద్ పట్టణంలోని పలు చౌక్‌లు ఇటీవల చేపట్టిన పట్టణ సుందరీకరణ పనులతో ఆకట్టుకునేలా అభివృద్ధి చెందాయి. పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ కూడలి కళావిహీనంగా కన్పించగా ప్రస్తుతం వాటర్ ఫౌంటేన్, పచ్చదనంతో కనువిందు చేస్తోంది. ఎన్టీఆర్ చౌక్ నుంచి బస్టాండ్ వైపు వెళ్లే రోడ్డు డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో ఆకట్టుకుంటుంది. కొన్నేళ్ల కిందటి అనంతరం కొత్తగా ఆదిలాబాద్‌ను సందర్శించిన వారు ఔరా అన్పించేలా చౌక్‌లు ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

